నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I హైదరాబాద్, గురువారం 22 ఆగస్టు 2024 RANGAREDDY

## ఉదయం పది నుంచే ధర్నాలు

**వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్**



వికారాబాద్, ఆగస్టు 21 : రైతులందరి పంట రుణాలను ఎలాంటి ఆంక్షలు, కొర్రీల్లేకుండా మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నాలు నిర్వహిస్తామని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు వికారాబాద్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు, ధర్నాలు ఉంటాయని.. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.


## ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతాం..



ఇబ్రహీంపట్నం, ఆగస్టు 21 : రైతులకు రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైనది. ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా గురువారం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో ఉదయం తొమ్మిది గంటలకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నా నిర్వహిస్తున్నాం. ఈ నిరసనకు నియోజకవర్గానికి చెందిన అన్నదాతలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలి. ఈ ధర్నాలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతాం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతులందరి రుణాలను మాఫీ చేసి మాట నిలబెట్టుకోవాలి.

**-మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే**

# మాఫీపై రణభేరి



**రుణమాఫీపై ధోకా చేసిన కాంగ్రెస్ సర్కారుపై సమరశంఖం పూరించిన బీఆర్ఎస్**

- **నేడు ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు**
- **చేవెళ్లలో జరిగే ధర్నాలో పాల్గొననున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి**


రంగారెడ్డి, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ) : రుణమాఫీపై ధోకా చేసిన కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ సమరశంఖం పూరించింది. మాఫీకి నోచుకోక ఆందోళన చెందుతున్న రైతాంగానికి బాసటగా నిలవాలని సంకల్పించి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధర్నాకు పిలుపునివ్వడంతో గురువారం జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించేందుకు గులాబీ దళం సన్నద్ధమైనది. చేవెళ్ల మండల కేంద్రంలో నిర్వహించే ధర్నాలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డితో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొననున్నారు. జిల్లా రైతులు కూడా పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొననున్నారు.

### ప్రభుత్వానికి 'మాఫీ' సెగ..

కాంగ్రెస్ ప్రభుత్వం మూడు విడతల్లో చేసిన రుణమాఫీ ప్రక్రియ ప్రహసనంగా మారింది. అర్హత ఉన్నప్పటికీ లక్షలాది మంది రైతులకు రుణమాఫీ కాలేదు. వివిధ నిబంధనలు, కొర్రీలతో అర్హులైన రైతులకు సైతం మాఫీని ఎగ్గొట్టింది. జిల్లాలో మూడు విడతల్లో కలిసి జిల్లాలో 87,612 మందికి రూ.660.72 కోట్లను మాత్రమే మాఫీ చేసింది. అర్హత కలిగిన రైతులు లక్షల్లో ఉండగా..వేలల్లోనే మాఫీ చేసి మమ అనిపించింది. దీంతో రైతుల నుంచి తీవ్ర స్థాయిలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పరిష్కారం లభించక నేటికీ బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ బాధిత రైతులు ఇంకా ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ గురువారం జిల్లా వ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తున్నది. ఇందుకు పార్టీ శ్రేణులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తాం..

ఆంక్షల్లేకుండా అర్హులందరికీ రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేయాలని మాజీ మంత్రి పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం శ్రీనగర్‌లోని తన నివాసంలో చేవెళ్ల మండల ముఖ్య కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ తలపెట్టిన రైతు ధర్నాకు పార్టీ శ్రేణులు, రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. రుణమాఫీపై నిర్వహించనున్న ధర్నాతో ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతోపాటు రుణమాఫీపై కాంగ్రెస్ నైజాన్ని బయట పెడతామన్నారు. గురువారం ఉదయం 11.00 గంటలకు చేవెళ్ల మండల కేం ద్రంలోని వేంకటేశ్వరాలయం వెనుక ఉన్న ప్రాంతంలో ధర్నా జరుగుతుందని.. దీనికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నట్లు ఆమె చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, పట్లోళ్ల కౌశిక్ రెడ్డి, చేవెళ్ల మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చేవెళ్ల మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి



ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

## ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి భూమిపూజ

- **వేద మంత్రోచ్ఛరణల మధ్య పూజ చేసిన స్పీకర్ ప్రసాద్‌కుమార్**
- **వికారాబాద్‌లో రూ.235 కోట్లతో జరుగనున్న పనులు**

వికారాబాద్, ఆగస్టు 21 : వికారాబాద్ జిల్లాలో నిర్మించనున్న ప్రభుత్వ వైద్య కళాశాల పనులకు బుధవారం రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ వేదమంత్రోచ్ఛరణల మధ్య భూమిపూజ చేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మేకలగండిలోని 30 ఎకరాల్లో రూ. రూ.235 కోట్లతో వివిధ భవనాలను నిర్మించనున్నారు. ముందుగా కార్యక్రమ ప్రాంగణానికి శాసనసభాపతి రాగా కలెక్టర్ ప్రతీక్ జైన్ పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు. శంకుస్థాపనలో ఎస్పీ నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారమేశ్, వైస్ చైర్ పర్సన్ శంషాద్‌బేగం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ వసంతనాయక్, ఈఈ శ్రీధర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ పద్మ, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రయ్య, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ పాల్గొన్నారు.

## అన్నదాతలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి, సీనియర్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి**

చేవెళ్లటౌన్, ఆగస్టు 21 : ఎలాంటి షరతుల్లేకుండా రైతులకు ఒకేసారి రుణమాఫీ చేయాలని చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి, సీనియర్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాఫీకి నోచుకోని అన్నదాతలకు అండగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం చేవెళ్ల మండల కేంద్రంలోని వేంకటేశ్వరాలయం వెనుక నిర్వహించే నిరసన, ధర్నా స్థలాన్ని ఆయన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. గత పదేండ్ల కాలంలో లేని కష్టాలు, ఇబ్బందులను ఈ ఎనిమిది నెలల కాలంలో అన్నదాతలు పడుతున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మూడు విడతల్లో చేసిన రుణ మాఫీతో లక్షలాది మందికి మాఫీ వర్తించలేదని.. దీంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్రంలోని ప్రతి రైతుకూ ఎటువంటి షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలని గురువారం ఉదయం చేవెళ్ల మండల కేంద్రంలో నిర్వహించే రైతు నిరసన, ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. ధర్నా స్థలాన్ని పరిశీలించిన వారిలో రంగారెడ్డి డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర కనీస వేతనాల సంస్థ మాజీ చైర్మన్ నారాయణ, ఎంపీపీ బాల్‌రాజ్, పార్టీ మండల అధ్యక్షుడు పెద్దొల్ల ప్రభాకర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆంజనేయులు, అనంతరెడ్డి, బీసీ సెల్ మండలాధ్యక్షుడు రామగౌడ్, మాజీ సర్పంచ్ నరహరి రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సింహులు, డైరెక్టర్లు వెంకటేశ్, చందు, నాయకులు శేఖర్‌రెడ్డి, సత్తి, మహేశ్, జంగయ్య, రాంప్రసాద్, మాణిక్యరెడ్డి, బాలు తదితరులు ఉన్నారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొననున్న నిరసన, ధర్నా స్థలాన్ని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి పరిశీలిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి

# మాఫీ.. కథ కంచికేనా..?

**ఇప్పుడు ఎక్కడ చూసినా.. రుణమాఫీ ముచ్చట్లే.. ఏ గ్రామానికెళ్లినా మాఫీకి నోచుకోని రైతుల సమస్యలే వినిపిస్తున్నాయి. గ్రీవెన్స్‌లో వేలాది మంది రైతులు ఫిర్యాదులు చేసినా పరిష్కారం కాకపోవడంతో తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో బాధిత రైతులకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించి రైతుల నుంచి మళ్లీ దరఖాస్తులను స్వీకరిస్తున్నది. మాన్యువల్‌గా స్వీకరిస్తున్న అప్లికేషన్ల వివరాలను ఎంట్రీ చేసేందుకు ప్రభుత్వం యాప్‌ను మాత్రం అందుబాటులోకి తీసుకురాలేదు. యాప్ వచ్చేది ఎప్పుడు?..వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి పంపేది ఎప్పుడు? మాఫీ అయ్యేది ఎప్పుడో..? అంటూ రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. మాఫీ..కథ కంచికి చేర్చేందుకే ప్రభుత్వం ఇలా..కాలయాపన చేస్తున్నదని విమర్శలున్నాయి.**

**-రంగారెడ్డి, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ)**

- **స్పెషల్ డ్రైవ్ పేరిట రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న నోడల్ అధికారులు**
- **ఆ వివరాల ఎంట్రీకి ప్రత్యేక యాప్‌ను తీసుకురాని ప్రభుత్వం**
- **ఆప్షన్లు ఇస్తేనే..ప్రక్రియ ముందుకు సాగే అవకాశం!**
- **కాలయాపన చేసేందుకే అన్న సందేహాలను వ్యక్తం చేస్తున్న రైతాంగం**
- **రుణమాఫీ అవుతుందా? లేదా..? అని అన్నదాతల్లో అనుమానాలెన్నో..**



జిల్లాలో మొదటి విడతలో 49,471 మందికి రూ.257.19 కోట్లు, రెండోవిడతలో 22,915 మందికి రూ.218.13 కోట్లు, మూడోవిడతలో 15,226 మందికి రూ.185.40 కోట్ల రుణాలను మాఫీ చేసినట్లు ప్రభుత్వం చెబుతున్నది. మూడు విడతల్లో కలిపి జిల్లాలో 87,612 మందిరైతులకు రూ.660.72 కోట్లను మాఫీ చేసింది. అర్హులు లక్షల్లో ఉండగా.. వేలల్లోనే రుణమాఫీ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకొన్నది. రేషన్ కార్డులేక కుటుంబ నిర్ధారణ కాకపోవడం, పట్టాపాస్ బుక్ లేకపోవడం, ఆధార్‌కార్డుకు లోన్ ఖాతాకు పేరులో తేడా ఉండడం, సొసైటీలు, బ్యాంకుల్లో జరిగిన తప్పులతో వేలాది మంది రుణమాఫీకి దూరమయ్యారు. మూడో జాబితాపై ఆశలు పెట్టుకున్న వారిపైనా ప్రభుత్వం నీళ్లు చల్లింది. ప్రభుత్వం ప్రకటించిన అన్ని అర్హతలు ఉన్న వారిలో చాలామందికి రుణమాఫీ కాలేదు. తెల్లరేషన్ కార్డు ఉన్నా.. కుటుంబంలో ఒక్కరే రుణం తీసుకున్నా..పట్టాపాస్ పుస్తకం ఉన్నా.. ఆధార్‌కార్డు, బ్యాంకు బుక్‌లో ఎలాంటి పొరపాట్లు లేకున్నా రూ.2 లక్షల్లోపు రుణమాఫీ వర్తించలేదు.

సర్కారు ప్రకటించిన మూడు విడతల్లోనూ మాఫీ కాని అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. జిల్లాలోని 27 మండలాలకు వ్యవసాయ అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించింది. ఏవోలు లేనిచోట ఏఈవోలను నియమించారు. ఎంపిక చేసిన రైతువేదికలు, ఎంపీడీవో, తహసీల్దార్, వ్యవసాయ, మార్కెట్ కార్యాలయాల్లో ఈనెలాఖరు వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రైతుల నుంచి వినతులను స్వీకరించనున్నారు. రుణమాఫీ ప్రక్రియను సాగదీసేందుకే..ప్రభుత్వం మళ్లీ మళ్లీ దరఖాస్తులను స్వీకరిస్తున్నదన్న అనుమానాలు అన్నదాతల నుంచి వ్యక్తమవుతున్నాయి.

### ఆప్షన్లు ఇస్తేనే ప్రక్రియ ముందుకు..

రుణమాఫీ కాకపోవడానికి గల కారణాలను తెలుసుకునేందుకు గతంలో ప్రభుత్వం యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. మాఫీ ఎందుకు కాలేదో చెప్పిన అధికారులు పరిష్కారం మాత్రం చూపలేకపోయారు. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపించామని చేతులు దులుపుకొన్నారు. జిల్లాలో రెండో విడతకు ముందే 16 వేలకుపైగా ఫిర్యాదులు రైతుల నుంచి అధికారులకు అందాయి. వీటిలో ఎన్నింటికి పరిష్కారం చూపించారన్న దానిపైనా ఇప్పటికీ స్పష్టత లేదు. ఈ పరిస్థితుల్లో మళ్లీ ప్రభుత్వం నోడల్ అధికారుల ద్వారా వినతులను స్వీకరిస్తున్నది. కానీ.. వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేక యాప్‌ను మాత్రం అందుబాటులోకి తీసుకురాలేదు. జిల్లాలో చాలామంది రైతులు చిన్నచిన్న కారణాలతోనే మాఫీకి దూరమయ్యారు. అలాంటి రైతులకు వెంటనే పరిష్కారం చూపే అవకాశం ఉన్నా.. ఆ దిశగా ప్రభుత్వం జిల్లాస్థాయి అధికారులకు ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదు. దీంతో తమ పని దరఖాస్తుల స్వీకరణ వరకే అన్నట్లుగా.. అధికారుల ధోరణి ఉన్నది. యాప్‌ను అందుబాటులోకి తెచ్చి పరిష్కారానికి ఆప్షన్లు ఇస్తేనే..రైతుల వినతులకు పరిష్కారం లభించనున్నది. ప్రభుత్వ తీరుతో..తమకు రుణం మాఫీ అవుతుందా? లేదా? అని రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

### ఇద్దరికి ఒకే రేషన్‌కార్డు ఉన్నదని ..

నేను ఎస్‌బీఐలో రూ.2.40 లక్షల రుణం తీసుకున్నా. నా కుమారుడు ఆంధ్రాబ్యాంకులో రూ. లక్ష రుణం తీసుకున్నాడు. ఒకే రేషన్ కార్డు ఉన్నదన్న కారణంతో మా ఇరువురిలో ఎవరీ రుణం కూడా మాఫీ కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ విషయంలో రైతులను మోసం చేస్తున్నది. అర్హులందరి రుణాలను మాఫీ చేస్తామని చెప్పి.. వివిధ కారణాలు, కొర్రీలతో పథకానికి దూరం చేస్తున్నది. సీఎం రేవంత్ ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ రుణమాఫీని వర్తింపజేయాలి.



**-కడారి సాయిలు, జంగారెడ్డిపల్లి (ఆమనగల్లు మున్సిపాలిటీ)**

## చెరువుల సర్వేను పూర్తిచేయాలి

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక**



సమీక్షలో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని చెరువుల సర్వేను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ శశాంక రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ఆర్డీవోలు, ఇరిగేషన్ అధికారులు, హెచ్‌ఎండీఏ నోడల్ అధికారులతో చెరువుల సర్వేపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 1,075 చెరువులుండగా 945 చెరువుల సర్వే పూర్తైందని.. ఇంకా 38 చెరువుల సర్వే చేయాల్సి ఉందని.. వాటిని వారంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామనక్షలు, పహణీలతో క్షేత్ర స్థాయిలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి ఎఫ్‌టీఐలు, బఫర్లను గుర్తిస్తూ కడీలు, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించే సమయంలో ఆయా చెరువులకు సంబంధించిన మ్యాపులను తీసుకెళ్లాలన్నారు. తొలుత క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు, ఇరిగేషన్ ఏఈలు సంయుక్తంగా తమ పరిధిలోని చెరువులను పరిశీలించి డివిజన్ స్థాయికి నివేదికలు పంపాలని, ఫైనల్ సర్వే నిర్వహించిన వెంటనే ఆయా చెరువుల నివేదికలను హెచ్‌ఎండీఏకు పంపించాలన్నారు. జిల్లాలోని చెరువులు ఆక్రమణలు, కబ్జాలకు గురి కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావే శంలో ఆర్డీవోలు సూరజ్‌కుమార్, అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి, సాయిరాం, వేణుమాధవ్, ఇరిగేషన్ డీఈ నరేందర్‌రెడ్డి, హెచ్‌ఎండీఏ నోడల్ అధికారి రమాదేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.